కథ

# డేగ


బొడ్డేడ బలరామస్వామి

89197 07141


'క్కొక్కొరోకో..' మెడ సాగతీసి, రెక్కలను టపటపలాడిస్తూ హుషారుగా కూసింది కోడిపుంజు అలియాస్ డేగ.

దాని అరుపుతో.. పెరట్లో పట్టిమంచ మ్మీద కునుకు తీస్తున్న పడమటయ్య దిగ్గున లేచి కూర్చున్నాడు. కొయ్యకు కట్టేసున్న డేగ మహా హుషారుగా ఉంది. ఓ రెండు కోడిపెట్టలు దాన్ని కవ్విస్తున్నాయి. అది చూసి అతను గాబరా పడిపోయాడు. జరగరాని ఘోరం జరిగిపోయిందేమోనని భయపడిపోయి.. తువ్వాలతో అదిలిస్తూ కోడిపెట్టలను అక్కణ్నుంచి దూరంగా తరిమేశాడు.

'కూస్త ఆదమరిస్తే సాలు.. పక్కింటోల్ల పెట్టలు నా డేగతో సరసాలాడ్డానికి వొచ్చేతున్నయి!' అంటూ గొణుక్కున్నాడు పడమటయ్య.

దీపాల వేళ కావడంతో డేగ కాలుకు కట్టిన తాడును విప్పాడు. దాన్ని గోముగా చేతుల్లోకి తీసుకుని, మెడను మృదువుగా నిమురుతూ..

''పెట్టలను తరిమేసినానని నా మీద కోపంగుందా? ఇంకెంత కాలమీ ఉపాసమని గునుగుతున్నవా? ఇంకెన్ని దినాల్లే! పందెం గెల్సీగానే.. నిన్ను నీ ఇస్టానికొదిలేత్తను. సరేనా?'' అన్నాడు. దానికి ఏమర్థమయ్యిందో మరి.. 'కొక్కొరోకో' అని కూసింది. దాంతో..

''అయితే పందెం గెలిసేత్తవన్నమాట! నాయమ్మే!'' అన్నాడు మురిసిపోతూ..

డేగకి గంట్లు, ఉడకబెట్టిన గుడ్డు తినిపించి వరండాలో కోళ్లగంప కింద భద్రంగా మూశాడు.

పడమటయ్యకు ఎనభైయేళ్లు ఉంటాయనడానికి వడలిన దేహం, నెరిసిన తలే నిదర్శనాలు! ముక్కు పోగు, ముతక పంచె, మాసిన లాల్చీ, భుజమ్మీద తువ్వాలు.. శ్రమజీవి అనడానికి తార్కాణాలు! భార్య అనారోగ్యంతో కాలంచేసి ఐదేళ్లయింది. కొడుకులిద్దరూ విశాఖపట్నంలో ఉద్యోగాలు చేస్తూ అక్కడే ఉంటున్నారు. వాళ్లు రమ్మంటున్నా వెళ్లక.. ఇల్లే తీర్థం – పొలమే వారణాసి – ఆ ఊరే కైలాసంలా తన అరెకరాన్ని సాగుచేసుకుంటూ ఒంటరిగా ఉంటున్నాడు.

అనకాపల్లి జిల్లాలో శారదానదిని ఆనుకుని పచ్చని పొలాల మధ్య ఉంది ఆ పల్లె! సంక్రాంతికి ఆ పల్లెలో కోడిపందేలవుతాయి. ఏనాడూ వాటి జోలికిపోని పడమటయ్య.. రెండేళ్ల క్రితం తన మిత్రుడు దుర్గయ్య బలవంతం చేస్తే అయిష్టంగానే వెళ్లాడు. అక్కడ పదుల సంఖ్యలో ఉన్న కోడిపుంజులను చూసి ముచ్చటపడ్డాడు. వాటి రంగులను బట్టి డేగ, కాకి, సేతువ, నెమలి, కొక్కిరాయి, పచ్చకాకి, రసంగి, కౌజు, పర్ల వంటి పేర్లతో పిలుస్తారని దుర్గయ్య చెబుతుంటే కుతూహలంగా విన్నాడు. కోడిపందేలలో ఎత్తుడు దింపుడు పందెం, ముసుగు పందెం, డింకీ పందెం, చూపుడు పందెం ఉంటాయని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. అంతలో పల్లపు వీధి సూరిబాబు నెమలి, మెరకవీధి గంగరాజు కాకి పందేనికి సిద్ధమయ్యాయి. దుర్గయ్య పుంజులను పరిశీలించి..

''గంగరాజు కాకి మాంచి ఏపుమీదుంది. దాని మీద పందెంగట్టు. గెలుత్తవు!''..

''సూసెల్లిపోతేగాదు.. పందెం గెలిత్తేనే ఆనందముంటది!'' అంటూ పడమటయ్యను ఎగదోశాడు.

ఏ కలనున్నాడో పడమటయ్య.. పందెంకట్టి సూరిబాబుకు మూడువేలు సమర్పించుకున్నాడు.



పుట్టి బుద్ధెరిగిన దగ్గర్నుంచి అతను పరాయిసొమ్ము ఆశించిందీ లేదు, తన సొమ్ము వట్టినే ఎవ్వరికీ ఇచ్చిందీ లేదు. అలాంటి పడమటయ్య తొలిసారిగా పందెంకాసి మూడువేలు పోగొట్టుకోవడంతో కుడితి కుండలో పడ్డ ఎలుకలాగ యేడాదిపాటు గింజుకున్నాడు. బుద్ధిలేక కోడిపందేలు చూడ్డానికి వెళ్లానని ఎన్నోమార్లు గొణుక్కున్నాడు. ఓడినచోటే తిరిగి తన సొమ్ము రాబట్టుకుని, ఆ తర్వాత కోడిపందేల ముఖం చూడకూడదనుకున్నాడు. సంక్రాంతివరకూ కాసుక్కూర్చొని మరీ సూరిబాబుతో పందెంకట్టాడు. మళ్లీ మూడువేలు పోగొట్టుకున్నాడు.

సూరిబాబు మీసం మెలేస్తూ..

''ఒరే ముసలి నక్క! కాటికి కాలు సాపుకొని ఇంటికాడ కూకోక పందెం గెలుద్దామనొచ్చవు! బొక్కబోర్ల పడ్డవు. నన్ను గెల్సీడం నీతరం గాదుగానీ, ఇంటికెల్లి ముసుగేసుకుని తొంగో!'' అంటూ అందరి ముందూ ఎగతాళి చేశాడు. అది విని అంతా నవ్వుకున్నారు. ఆ అవమానభారంతో ఇంటిదారి పట్టాడు పడమటయ్య.

'కుర్రకుంక ఎంత మాటనేసినడు!? కాటికి కాలు సాపుకొని కూకోమంతడా? నాను ముసలి నక్కనని ఎటకారం సేత్తడా? నలుగుర్లోనూ అవుమానిత్తడా? వొచ్చే సంకురాత్రికి ఆడి పుంజునోడించి.. ఈ ముసలోడి దెబ్బేటో ఆడికి రుసి సూపిత్తను. నా దెగ్గిర గెల్సిన డొబ్బులను కక్కిత్తను' అని పంతం పట్టాడు.

స్వతహాగానే పట్టుదలగల మనిషి పడమటయ్య. ఇక వేరేవాళ్ల కోడిపుంజుల మీద పందెం కాయకూడదని అనుకున్నాడు. తనే కోడిపుంజును పెంచి, బరిలో నిలవాలనుకున్నాడు. అందుకోసం తలపండిన పందెం రాయుళ్లను కలిశాడు. పందెం కోడిని ఎలా పెంచాలో, ఎటువంటి ఆహారం పెట్టాలో తెలుసుకున్నాడు. పోరాట పటిమలో డేగను మించిందిలేదని విని.. ఎర్ర ఈకలు గల డేగకోసం రెండుమూడు కోళ్లసంతలు తిరిగి ఐదునెలల వయసున్న డేగను కొన్నాడు. దాని సంరక్షణ కోసం తన పొలాన్ని బీడుపెట్టేశాడు. తన వ్యాపకాలన్నిటినీ పక్కన పెట్టేశాడు. పందెం గెల్చి సూరిబాబు పొగరణచి, పోగొట్టుకున్న డబ్బూ.. పరువూ నిలుపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు. డేగతోనే తన దినచర్య ఆరంభమవుతుంది. దానితోనే పూర్తవుతుంది. తెల్లవారుతూనే దాన్ని నదికి తీసుకెళ్లి, కాసేపు ఈత కొట్టిస్తూ వ్యాయామం చేయిస్తాడు. పనిలో పనిగా అక్కడే తన కాలకృత్యాలూ, స్నానమూ కానిచ్చేస్తాడు. అటు తర్వాత ఇంటికి తీసుకొచ్చి బాదం పప్పు, నల్లద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లనువ్వులు, తాటి బెల్లం కలిపి గుండ్రంగా తయారుచేసిన ఉండలను.. గంటకొక్కటి చొప్పున దాని నోటికందిస్తాడు. మధ్యాహ్నం కైమా, జీడిపప్పు తినిపిస్తాడు. సాయంత్రం గంట్లు, సోళ్లు, ఉడకబెట్టిన గుడ్డుతో మేపుతాడు. దాని శరీరం గట్టిపడటం కోసం ముప్పూటలా చల్లని నీళ్లను నోట్లోకి తీసుకుని.. దాని శరీరం తడిసేలా గట్టిగా ఊస్తాడు. దానికి చిన్న సుస్తీ చేసినా.. జాగు చేయకుండా పశువుల ఆసుపత్రికి తీసుకెళ్తాడు.

క్రమక్రమంగా పడమటయ్యకు డేగతో మంచి అనుబంధం ఏర్పడింది. దాన్ని విడిచిపెట్టి క్షణం కూడా ఉండలేకపోతున్నాడు. డేగకూడా అతను కాసేపు కనిపించకపోతే చాలు.. గోలగోల చేస్తుంది. అతను కనిపించగానే.. రెక్కలు టపటపలాడిస్తూ తన ఆనందాన్ని వ్యక్తపరుస్తుంది. సంక్రాంతి దగ్గర పడుతున్న కొద్దీ పడమటయ్యను కోడికత్తి భయపెడుతున్నది. కత్తి తగిలి తన డేగ గాయపడ్డమో, చావడమో జరిగితే.. అన్న ఊహే అతనికి నిద్రలేకుండా చేస్తున్నది.

'డింకీ పందెమైతే కత్తులు కట్టరంట. సూరిబాబుతో డింకీ పందెం కడదామని అడగాల!' అని అప్పటికి చాలాసార్లు అనుకున్నాడు.

* * *

ఆ రోజు భోగి పండుగ. ఆ మర్నాడే కోడిపందేలు!

పడమటయ్య తన డేగను ఎప్పటిలాగే నదికి తీసుకెళ్లి వ్యాయామం చేయించాడు. ఎప్పుడూ లేనిది షాంపుతో దాన్ని బాగా రుద్ది స్నానం చేయించాడు. కాసేపు దాన్ని ఎండలో చలికాయించి తిరిగొస్తుంటే.. ఏటిగట్టుమీద సూరిబాబు బైక్ మీదొస్తూ ఎదురైతే ఆపాడు.

సూరిబాబు వెటకారంగా నవ్వి..

''నీ పుంజును తెగ మేపుతున్నవంట! భలేగా టయినింగిత్తున్నవంట! ఏటీ.. నా పుంజునోడించేద్దామనే?! నామీద గెలిసేద్దామనే?! ముసలి నక్కవి నీకంత కలేజా ఉందా?'' అన్నాడు.

''ఉందో.. నేదో రేపు తెలుత్తది గానీ.. డింకీ పందెం ఏద్దం! పుంజుల పేనాలకు ఏటిగాదు. ఏటంతవు?''.

''ఏటీ.. డింకీ పందెమా? పుంజులు పూటల్లా కొట్టుకున్నా.. ఆ పందెం తేల్దు! రేపు జెరిగేవన్నీ ఎత్తుడు దింపుడు పందేలే! బేగొచ్చి నీ పుంజును నా పుంజుకత్తికి బలిచ్చేద్దువు గానీ'' అంటూ బైక్‌ను ముందుకు పోనిచ్చాడు.

సూరిబాబు మాటలతో తన ఆశ ఆవిరైనందుకు చింతిస్తూ..

